# ఐక్య ఉపాధ్యాయ

ఆంధ్రప్రదేశ్ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ అధికార పత్రిక

సంపుటి - 2 సంచిక - 4 కృష్ణా/విజయవాడ మార్చి - 2021 పేజీలు -28 రూ.15.00




# ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి బొడ్డు నాగేశ్వరరావు గారికి ఏపిటిఎఫ్ (1938) మద్దతు



పిడిఎఫ్ ఫ్లోర్ లీడర్ వి.బాలసుబ్రహ్మణ్యం



ఎమ్మెల్సీ వై.శ్రీనివాసులురెడ్డి



ఎమ్మెల్సీ కె.యస్.లక్ష్మణరావు



పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి షేక్ సాబ్జీ



యుటియఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి.బాబురెడ్డి



ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు



పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి బొడ్డు నాగేశ్వరరావు



యుటియఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కె.ఎస్.ఎస్. ప్రసాద్



ఎమ్మెల్సీ రాము సూర్యారావు

# ఐక్యఉపాధ్యాయ

విద్యా విషయక మాసపత్రిక

## సంపాదక వర్గం

**టి.ఎస్.ఎల్.ఎన్.మల్లేశ్వరరావు**
సంపాదకులు

సంపాదకవర్గ సభ్యులు
**పొక్కిరెడ్డి బాబురెడ్డి**
**షేక్ సాబ్జీ**
**సిహెచ్.శ్రీహరి**
**పి.రమణారెడ్డి**


ఈ సంచికలో...


| | |
|---|---|
| జాతీయం-అంతర్జాతీయం | - 4 |
| ఉద్యమ అభ్యర్థులను గెలిపించుకుందాం | - 5 |
| పిడిఎఫ్ అభ్యర్థులకు బ్రహ్మరథం... | - 6 |
| అంతర్జాతీయ మహిళా దినోత్సవం | - 7 |
| సాబ్జీని గెలిపిద్దాం | - 9 |
| ఆదర్శనేత అమరజీవి ఏవిఎస్ | - 11 |
| పిడిఎఫ్ ఎమ్మెల్సీల గెలుపు - ప్రజా... | - 13 |
| ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార దృశ్యాలు | - 14 |
| అనుగ్రహం (కథ) | - 16 |
| జిల్లా కౌన్సిల్ సమావేశాలు | - 19 |
| ప్రాతినిధ్యాలు - సదస్సులు ..... | - 20 |
| జిల్లా కమిటీలు | - 21 |
| ప్రభుత్వ ఉత్తర్వులు | - 22 |



| | | |
|---|---|---|
| దశాబ్దిచందా | : | ₹ 1250-00 |
| 5 సం॥ చందా | : | ₹ 650-00 |
| సం॥ చందా | : | ₹ 150-00 |
| విడిప్రతి | : | ₹ 15-00 |

**Union Bank Online**
**A/c No. 346402010025027**
**IFSC Code : UBIN0534641**



**ఐక్యఉపాధ్యాయ**
యుటియఫ్ ఆఫీస్, పాలపర్తివారి వీధి
గవర్నర్‌పేట, విజయవాడ-520002
Ph.No. : 0866-2973763
MobileNo. : 9494112533
Website : www.aputf.org
E-mail : ikyopadhyaya1975@gmail.com


# శాసన మండలి ఎన్నికలలో ఎవరిని గెలిపిద్దాం?

మార్చి 14న జరగనున్న రెండు శాసనమండలి ఉపాధ్యాయ నియోజకవర్గంలో అనేకమంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. వీరిలో ఎవరిని శాసనమండలికి పంపితే ఉపాధ్యాయ, అధ్యాపక ప్రయోజనాలు నెరవేరతాయో, ఎవరిని పంపితే రాజకీయ పక్షాలతో, కార్పొరేట్‌లకు అనుకూలంగా ఉంటారో ఆలోచించి నిర్ణయం తీసుకోవలసిన కీలక సమయమిది.

ఏ ఉద్యోగ, వృత్తి వర్గాలకు లేని విధంగా రాజ్యాంగంలో ఉపాధ్యాయులకు మాత్రమే ప్రత్యేకంగా శాసనమండలి స్థానాలు ఉన్నాయి. మేధావివర్గంగా చెప్పుకునే ఉపాధ్యాయులు ఈ ప్రత్యేకతను నిలబెట్టుకోవాల్సిన అవసరం వుంది.

రాష్ట్రంలో అనేక సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయి. వాటిపై అనేక పోరాటాలు చేస్తూనే ఉన్నాము. మన పోరాటాలన్నింటిలో మనతోపాటు ఉండి, మన వాణిని శాసన మండలిలో వినిపించే ఉద్యమ అభ్యర్థులనే శాసనమండలికి పంపిద్దాం.

ఉపాధ్యాయులు వివేకవంతులు, వివేచన కలవారు. అన్నింటికన్నా మించి ఆత్మ గౌరవం, ఆత్మాభిమానం కలవారు. అలాంటి మన ఆత్మాభిమానానికి ఎంతోకొంత విలువ కట్టాలని, ప్రలోభాలు పెట్టాలని చూసేవారు నిజంగా మన వైపునుండి మన వాణిని శాసనమండలిలో వినిపించగలరా అని ఆలోచన చేద్దాం. నిజంగా ఉపాధ్యాయులకు విద్యారంగానికి సేవ చేయదలుచుకున్నవారు ఉపాధ్యాయులను ఎందుకు ప్రలోభాలకు గురి చేస్తారు? ప్రలోభాలకు గురిచేసి గెలవాలనుకున్నవారు మన పక్షాన ఎందుకు నిలుస్తారు?

ఉపాధ్యాయులంటే ప్రలోభాలకు లొంగదీయవచ్చు అనే కుటిల ఆలోచనలను తిప్పి కొట్టాలి. ఉపాధ్యాయుల స్థాయిని దిగజార్చే విధంగా ప్రవర్తించే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలి. ఉపాధ్యాయులు అమ్ముడుపోరని చాటి చెప్పాలి. ఉపాధ్యాయులను ప్రలోభాలకు లేక ఒత్తిళ్ళకు గురిచేసి గెలవటం వెనుక ఏ ప్రయోజనాలు దాగి ఉంటాయో మనకు చరిత్ర చెబుతోంది. మరోసారి అలాంటి ఎత్తుగడలు ఉపాధ్యాయుల వద్ద పని చేయవు అని తెలియజెప్పాలి.

మనం అనుభవిస్తున్న ప్రయోజనాలు, ఇతర రాష్ట్రాలకన్న మెరుగైన స్థితిలో వేతనాలకు కారణం ఈ రాష్ట్రంలో నిర్మించబడిన బలమైన ఉపాధ్యాయ ఉద్యమం అలాంటి ఉద్యమం నుండి వచ్చిన వారు మాత్రమే మన సమస్యలను అర్థం చేసుకోగలరు. నిజాయితీగా శాసనమండలిలో ప్రస్తావించగలరు.

పిడిఎఫ్ మరియు అనేక ఉపాధ్యాయ అధ్యాపక సంఘాలు బలపరిచిన షేక్ సాబ్జీ ఉభయ గోదావరి జిల్లాల నుండి, బొడ్డు నాగేశ్వరరావు కృష్ణా-గుంటూరు జిల్లాల నుండి పోటీ చేస్తున్నారు. వీరిద్దరూ ఉపాధ్యాయ ఉద్యమంనుండి వచ్చినవారు. ఉపాధ్యాయులతో మమేకమై పనిచేసినవారు. నీతి, నిజాయితీ, నిబద్ధతతో నిలబడగలిగిన వారు. ఏ ప్రక్కకు ఒరిగిపోకుండా నికరంగా ఉపాధ్యాయ, అధ్యాపకుల పక్షాన నిలబడగలిగినవారు. వీరిరువురిని గెలిపించడం ద్వారా ఉపాధ్యాయ ఉద్యమాన్ని శాసనమండలికి పంపుదామని వీరిరువురికి మొదటి ప్రాధాన్యతా ఓటు (1) వేసి గెలిపించాలని కోరుతున్నాము.

ఉపాధ్యాయులు ఆలోచించాల్సిన సమయం ఉపాధ్యాయులు నీతివంతులని నమ్మి ఉపాధ్యాయుల పక్షాన నిలబడిన వారిని గెలిపించి మరోసారి ఉపాధ్యాయులను ఏదో ఒక 'రేటు'కి కొనాలని చూసేవారికి బుద్ధి చెబుదామని, మన ఆత్మ గౌరవం, ఆత్మాభిమానాలను నిలబెట్టుకొందామని విజ్ఞప్తి చేస్తున్నాము.

PRINTED AND PUBLISHED BY **POKKIREDDI BABU REDDY**, ON BEHALF OF A. P.UNITED TEACHERS FEDERATION, PRINTED AT PRAJASAKTI PRINTERS&PUBLISHERS PVT LTD, D.NO.27-30-4, AKULAVARI STREET, GOVERNERPET, VIJAYAWADA- 520002, KRISHNA DISTRICT, ANDHRA PRADESH, PUBLISHED AT A. P.UNITED TEACHERS FEDERATION, 27-31-11, PALAPARTHIVARI VEEDHI, GOVERNERPET, VIJAYAWADA.520002, KRISHNA DISTRICT, ANDHRA PRADESH. **EDITOR : T.S.L.N.MALLESWRA RAO.**

# జాతీయం అంతర్జాతీయం

## ప్రపంచవ్యాప్తంగా 25 లక్షల కరోనా మరణాలు .. 11.26 కోట్లకు పైగా కేసులు

కరోనా వైరస్ మహమ్మారి కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఇప్పటివరకు 25 లక్షల మంది మరణించారు. 2019 డిసెంబరులో తొలి కేసు వెలుగు చూసిన తర్వాత ఇప్పటివరకు 25,00,172 మంది మరణించగా, మొత్తంగా 11,26,18,488 కేసులు నమోదయ్యాయి. ఇందులో 8,42,894 మరణాలతో యూరప్ తీవ్రంగా దెబ్బతిని మొదటి స్థానంలో వుండగా, రెండో స్థానంలో లాటిన్ అమెరికా, కరేబియన్ ప్రాంతం (6,67,972 మృతులు) వుంది. ఇక అమెరికా, కెనడాల్లో కలిపి 5,28,039 మరణాలతో మూడో స్థానంలో వుంది. ప్రపంచవ్యాప్తంగా నమోదైన మరణాల్లో దాదాపు సగం మరణాలు కేవలం ఐదు దేశాల్లోనే సంభవించాయి. అమెరికా(5,06,232), బ్రెజిల్(2,49,957), మెక్సికో(1,82,815), భారత్(1,56,705), బ్రిటన్(1,22,070) వున్నాయి.

## అంతర్జాతీయ అవినీతి నిరోధక అవార్డుకు భారత మహిళ ఎంపిక

అంతర్జాతీయ అవినీతి నిరోధక ఛాంపియన్స్ అవార్డుకు పారదర్శకత, జవాబుదారీతనం అంశాలపై పోరాడుతున్న ఉద్యమ కర్త, సామాజిక వేత్త అంజలి భరద్వాజ్ ఎంపికయ్యారు. సాహసోపేత వ్యక్తులకు ఇచ్చే ఈ అవార్డుకు ఎంపికైన 12 మందిలో ఆమె ఒకరు. ఈ అవార్డును అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ యంత్రాంగం నూతనంగా ఏర్పాటు చేసింది.

## అన్నదాతలకు పెరుగుతున్న మద్దతు.. పలు దేశాల కార్మిక, పౌర సంఘాల సంయుక్త ప్రకటన

నూతన వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా రైతాంగం గత మూడు నెలలుగా సాగిస్తున్న చారిత్రాత్మక పోరాటానికి దేశీయంగానే గాక అంతర్జాతీయంగా కూడా మద్దతు మరింత పెరుగుతోంది. తాజాగా కెనడాతోపాటు బ్రిటన్, అమెరికా, ఫ్రాన్స్, నెదర్లాండ్, జర్మనీ, దక్షిణాఫ్రికా, నార్వే దేశాలకు చెందిన కార్మిక, పౌర సంఘాలు భారత రైతాంగ ఉద్యమానికి సంఘీభావం తెలుపుతూ ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు చేసిన విధంగా వ్యవసాయ ఉత్పత్తులకు సి2 ప్లస్ 50శాతం విధానంలో కనీస మద్దతు ధరను ఇవ్వాలని, ఎంఎస్‌పిపై చట్టబద్ధమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశాయి.

## టీకా తీసుకున్న ప్రధాని మోడీ...

దేశ వ్యాప్తంగా రెండవ దశ వ్యాక్సినేషన్ ప్రక్రియ మార్చి 1 నుండి ప్రారంభం అయ్యింది ఈ సందర్భంగా ప్రధాని మోడీ మార్చి 1వతేదీ సోమవారం ఉదయం కరోనా టీకా తీసుకున్నారు. ఢిల్లీలోని ఎయిమ్స్‌లో వ్యాక్సిన్ తొలి డోసును తీసుకున్నట్లు ఆయన ట్విట్టర్ ద్వారా వెల్లడించారు. ఆయన భారత్ బయోటెక్ -ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసిఎంఆర్) రూపొందించిన కొవాగ్జిన్ టీకాను తీసుకున్నారు.

## పోటెత్తిన జనసంద్రం – పీపుల్స్ బ్రిగేడ్‌కు 10 లక్షల మంది హాజరు


ఎస్.పి.మనోహర్ కుమార్

పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ మైదానం జనసంద్రమైంది. వామపక్షాలు, కాంగ్రెస్, ఇండియన్ సెక్యులర్ ఫ్రంట్ (ఐఎస్ఎఫ్) కలిసి సంయుక్తంగా నిర్వహించిన 'పీపుల్స్ బ్రిగేడ్'కు సుమారు పది లక్షల మంది దాకా హాజరయ్యారు. ఈ సభకు పట్టణాలు, పల్లెలు అన్న తేడా లేకుండా రాష్ట్ర నలుమూలల నుంచి ప్రజలు పెద్ద యెత్తున లోకల్ రైళ్లు, బస్సులు, ఇతర వాహనాల్లో తరలివచ్చారు.

## దేశంలో తొలి టాయ్ ఫెయిర్‌ను ప్రారంభం

భారత్‌లో తొలి టాయ్ ఫెయిర్-2021ను ప్రధాని మోడీ శనివారం ప్రారంభించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ ఫెయిర్‌ను ప్రారంభించిన ఆయన... బొమ్మల తయారీ రంగంలో దేశం ఆత్మ నిర్భర్ కావాలని కోరారు. భారత బమ్మలు... దేశ జీవన శైలిలో భాగంగా... పునర్వినియోగ రీ సైకిల్ సంస్కృతిని ప్రోత్సహిస్తాయని పేర్కొన్నారు. తక్కువ ప్లాస్టిక్, పునర్వినియోగ పదార్థాలను వినియోగించాలని తయారీదారులకు సూచించారు.

## సోషల్‌మీడియా నియంత్రణకు కేంద్రం చట్టం ...ముసాయిదా విడుదల

సోషల్‌మీడియాపై నియంత్రణ పేరుతో డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లను అదుపు చేసేందుకు కేంద్రం సిద్ధమైంది. సోషల్‌మీడియాపై నియంత్రణ కోసం ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (మధ్యవర్తులు, డిజిటల్ మీడియా, నీతినియమాల కోసం మార్గదర్శకాలు) నిబంధనలు - 2021 ముసాయిదాను మొదటిసారిగా కేంద్రం రూపొందించింది. డిజిటల్ న్యూస్ సంస్థలు, సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్‌లు, ఒటిటిలను ఏవిధంగా నియంత్రించాలో ఈ ముసాయిదాలో సూచించింది. ఈ నిబంధనల ప్రకారం.. సోషల్‌మీడియాపై పలు మంత్రిత్వ శాఖల పర్యవేక్షణ ఉండనున్నట్లు సమాచారం. దేశ సార్వభౌమత్వాన్ని, సమగ్రతను ప్రభావితం చేసే, జాతి భద్రతకు ముప్పు కలిగించే సందేశాలను నిషేధించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రం తెలిపింది. ఐటి మంత్రి రవిశంకర్ ప్రసాద్, సమాచార, ప్రసార శాఖ మంత్రి ప్రకాష్ జవదేకర్ విడుదల చేయనున్న ఈ ముసాయిదాలోని నిబంధనల కాపీని ఇంటర్నెట్ ఫ్రీడమ్ ఫౌండేషన్ ( ఐఎఫ్ఎఫ్) విడుదల చేసింది.

## 'సిబిఎస్ఇ' అమలు రాష్ట్రాల హక్కులకు నష్టం.. సిఎంకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి మధు లేఖ..

సిబిఎస్ఇ సిలబస్ అమలు రాష్ట్రాల హక్కులపై కేంద్రం తలపెట్టిన మరో దాడి అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు ఆందోళన వ్యక్తం చేశారు. సిబిఎస్ఇ అమలు నిర్ణయాన్ని వెంటనే వెనక్కు తీసుకోవాలని కోరుతూ సిఎం వైఎస్ జగన్‌కు మధు శనివారం లేఖ రాశారు. గత ఆగస్టులో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నూతన విద్యావిధానం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉందని తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం ఈ విధానానికి, దానిని ఏకపక్షంగా అమలు జరపదలచుకున్న కేంద్రం తీరుకు అభ్యంతరం తెలిపి ఉండాల్సిందని సూచించారు

# ఉద్యమ అభ్యర్థులను గెలిపించుకుందాం

## యుటియఫ్





**మ**న రాష్ట్ర ఉపాధ్యాయ ఉద్యమానికి గొప్ప చరిత్ర ఉంది. కేవలం ఆర్థిక అంశాలే కాదు సామాజిక స్పృహతో సమాజ మార్పుకు తోడ్పడే లక్ష్యంతో పనిచేసే సామాజిక కోణం మన ఉద్యమంలో ఉంది. సమాజాభివృద్ధికి తోడ్పడే విద్య వ్యాపారంగా మారకూడదనే లక్ష్యంతో పనిచేస్తున్నాము. విద్యారంగంలో పనిచేసే ఉపాధ్యాయుల, అధ్యాపకుల హక్కుల కోసం పోరాడుతున్నాం. స్వతంత్ర పోరాటాల ద్వారా మరియు ఐక్య పోరాటాల ద్వార అనేక విజయాలు సాధించాము. స్పెషల్ టీచర్లు, అప్రెంటీస్ టీచర్లు, స్పెషల్ విద్యావాలంటీర్లు, అన్‌ట్రైన్డ్ టీచర్లు, కాంట్రాక్టు లెక్చరర్లు, పార్ట్‌టైం టీచర్లు, అన్‌ఎయిడెడ్ ఔట్‌సోర్సింగ్ ఇలా పలు రకాలుగా నియమింపబడిన ఉపాధ్యాయ వర్గాలకు అండగా నిలిచాం. జీతాలు భత్యాలు పెరగడమే కాదు ఉద్యోగ భద్రతకు కృషి చేశాం. ఇంకా సాధించవలసినవి ఉన్నాయి.

ప్రతి పిఆర్‌సిలో ఓ మెట్టు పైకి వచ్చాం. ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ తెచ్చుకున్నాం. అప్రెంటీస్ విధానం రద్దు, కౌన్సిలింగ్ విధానం, మున్సిపల్ టీచర్లకు 010 పద్దు ద్వారా జీతాలు, ఎయిడెడ్ టీచర్లకు డైరెక్టు పేమెంట్, ట్రైబల్ వెల్ఫేర్ టీచర్లకు సర్వీస్ రూల్స్, జిఓ 3 అమలు ఎన్నో సాధించాం. కోర్టు కేసుల వల్ల తాత్కాలికంగా ఆటంకం ఏర్పడినా ఉమ్మడి సర్వీస్ రూల్స్ అమలుకి కృషి చేస్తున్నాం.

సిపిఎస్ రద్దుకోసం మహా ఉద్యమమే నడిపాం.

ఆర్థిక సంస్కరణలతో పాలకుల విధానాలు మారాయి. ఉన్న సౌకర్యాలు రద్దు చేస్తున్న కాలంలో ఉన్నాం. ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదు. డిఏల కోసం నెలల తరబడి ఎదురుచూడాల్సి వస్తోంది.

ప్రతి రోజు యాప్‌లు అప్‌డేట్ చేయడమే ఉపాధ్యాయ వృత్తిగా మారుతోంది. విద్యార్థులకు చదువు చెప్పాల్సిన ఉపాధ్యాయులు బోధనేతర పనులతో మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. ఇంటర్నెట్ అందుబాటులో లేకపోయిన సర్వర్ పనిచేయకపోయిన ఉపాధ్యాయులను దోషులుగా చేసి మెమోలు, జీతాలు కోత అంటూ బెదిరింపులకు దిగుతున్నారు. ఈ పరిస్థితులు మారాలి. ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేయాలి.

**టీచర్లకు ప్రత్యేక స్థానం :**

శాసనమండలిలో మరే ఇతర వృత్తులకు లేని గౌరవం టీచర్లకు మాత్రమే కల్పించారు. సమాజంలో గురువులకు ఉన్నత స్థానం ఉంది. అందరికీ ఆదర్శంగా, నిజాయితీగా ఉంటారని శాసనమండలిలో ప్రత్యేకంగా స్థానాలు కల్పించారు. ఇతర రాష్ట్రాలలో టీచర్ల స్థానాల్లో సైతం రాజకీయ పార్టీలే నిలబడతాయి. కాని ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే ఉపాధ్యాయ సంఘాలు పోటీ చేసి గెలుస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ ఉద్యమానికి మాత్రమే ఈ గొప్ప చరిత్ర ఉంది.

ఉపాధ్యాయ ఉద్యమ పితామహుడు చెన్నుపాటి లక్ష్మయ్య నుంచి నేటివరకు (రెండు సార్లు తప్ప) ఏ సంఘానికి చెందినా ఉద్యమ నేతలే ఎమ్మెల్సీలుగా గెలుపొందారు. యుటియఫ్ మరియు ఇతర ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల మద్దతుతో 12మంది పిడిఎఫ్ ఎమ్మెల్సీలను గెలిపించుకున్నాం. మరికొందరు ఇతర సంఘాల నేతలకు మద్దతు ఇచ్చి గెలిపించాం. కార్పొరేట్ రాజకీయా లతో ధన, కుల ప్రభావాలు మొదలైనాయి. నిజాయితీగా నడుస్తున్న టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలను కలుషితం చేస్తున్నారు. టీచర్ల స్థానాల్లోకి రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు, కార్పొరేట్ శక్తులు, ఇప్పుడు అధికారుల అండతో కొందరు పోటీ చేస్తున్నారు. ప్రజాస్వామ్యంలో ఎవరైనా పోటీ చేయవచ్చు. ఎవరిని ఎన్నుకోవాలో ఓటర్లు నిర్ణయించుకోవాలి.

నిరంతరం ఉపాధ్యాయుల, విద్యారంగ సమస్యల పట్ల పోరాడే ఉద్యమ నేతల్ని గెలిపించుకోవాలా? పదవుల కోసం వచ్చేవారిని, విలువలు వదిలేసి డబ్బులతో ఓటర్లను కొంటామని వచ్చేవారిని గెలిపించాలా? అనేది నిజాయితీగా ఓటర్లే నిర్ణయించాలి. సమాజానికి ఆదర్శంగా మనం ఉండాలి. మన ఎన్నికలు సమాజానికి ఓ మార్గదర్శకం కావాలి. ఉపాధ్యాయ నేతలుగా ఎన్నికయ్యేవారు ఉపాధ్యాయుల స్థాయిన్ని మరింత ఉన్నత స్థాయికి పెంచేవారుగా ఉండాలి. డబ్బుతో గెలిచేవారు డబ్బు సంపాదనకే చూస్తారు. పదవుల కోసం వచ్చేవారు ఎన్నికల అనంతరం ఏ'ఖండువా' కప్పుకుంటారో తెలియదు. కానీ ఉద్యమ నేతలు ఉద్యమాల్లోనే ఉంటారు. ఉపాధ్యాయులతోనే ఉంటారు. ఉపాధ్యాయుల హక్కుల కోసం, సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తూ అందుబాటులో ఉంటారు. ఇప్పటివరకు గెలిచిన పిడిఎఫ్ ఎమ్మెల్సీలు ఆదర్శంగా

**(తరువాయి 8వ పేజీలో)**



# పిడిఎఫ్ అభ్యర్థులకు బ్రహ్మరథం పడుతున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులు



శాసనమండలి ఎన్నికలలో ఉభయగోదావరి జిల్లాల నుండి షేక్ సాబ్జీ, కృష్ణా-గుంటూరు జిల్లాల నుండి బొడ్డు నాగేశ్వరరావు పిడిఎఫ్ అభ్యర్థులుగా చేస్తున్న ప్రచారానికి ఉపాధ్యాయుల నుండి విశేష స్పందన లభిస్తోంది. పిడిఎఫ్ ఎమ్మెల్సీలు వి.బాలసుబ్రహ్మణ్యం, కె.యస్.లక్ష్మణ రావు, రాము సూర్యారావు, ఐ.వెంకటేశ్వరరావు, యండపల్లి శ్రీనివాసులు రెడ్డిలతో పాటు వీరిని బలపరుస్తున్న ఉపాధ్యాయ, అధ్యాపక సంఘ నేతలు చేస్తున్న ప్రచారానికి ఉపాధ్యాయుల నుండి మంచి ఆదరణ లభిస్తోంది. తమలోనుండి వచ్చిన ఉద్యమ అభ్యర్థులనే శాసనమండలికి పంపిస్తామని ప్రకటిస్తున్నారు. కొన్ని పాఠశాలల్లో పిడిఎఫ్ అభ్యర్థులనే గెలిపిస్తామని తీర్మానాలు చేయడం విశేషం. ఉద్యమ అభ్యర్థులను గెలిపించుకోవడం ద్వారా మాత్రమే సమస్యలు పరిష్కారమవుతాయని తమ ప్రగాఢ విశ్వాసం అని చెబుతున్నారు.

ఎయిడెడ్ విద్యారంగం పట్ల పిడిఎఫ్ ఎమ్మెల్సీలు చేసిన కృషిని ఎయిడెడ్ పాఠశాల ఉపాధ్యాయులు, ఎయిడెడ్ కళాశాలల అధ్యాపకులు బహిరంగంగానే అభినందిస్తున్నారు. ఎయిడెడ్ వారికి ఒకటవ తేదీన జీతాలు రావటం పిడిఎఫ్ ఎమ్మెల్సీల కృషే అని ప్రకటిస్తున్నారు. ఎయిడెడ్ పాఠశాలల పట్ల ప్రభుత్వం చూపుతున్న వివక్షను పిడిఎఫ్ ఎమ్మెల్సీలు ఎప్పటికప్పుడు నిలదీస్తున్నారని, ప్రస్తుతం తీవ్ర సంక్షోభంలో ఉన్న ఎయిడెడ్ విద్యా వ్యవస్థని నిలబెట్టగలిగిన వారు పిడిఎఫ్ మాత్రమే అని విశ్వసిస్తున్నట్లు, ఎయిడెడ్ కళాశాల ప్రిన్సిపాల్ జవహర్, ఎయిడెడ్ అధ్యాపకుల నాయకులు గయాజుద్దీన్ పేర్కొంటున్నారు.

మహిళా ఉపాధ్యాయులసమస్యల పరిష్కారంలో పిడిఎఫ్ ఎమ్మెల్సీల కృషిని మహిళా ఉపాధ్యాయునిలు అభినందిస్తున్నారు. చైల్డ్‌కేర్ లీవు తదితర అంశాల పరిష్కారం చేసినవారు, భవిష్యత్‌లో సమస్యలు పరిష్కారం చేయగలిగినవారు పిడిఎఫ్ ఎమ్మెల్సీలు మాత్రమే అని కుసుమ కుమారి పేర్కొన్నారు.

మోడల్ పాఠశాలలు, గురుకుల పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం కోసం ఎప్పటికప్పుడు ప్రాతినిధ్యం చేయడం, ప్రభుత్వంతో చర్చించడంతో పిడిఎఫ్ ప్రముఖంగా ఉందని, మోడల్, గురుకుల పాఠశాలల ఉపాధ్యాయులు మరియు నాయకకులు ఎన్.బోసుబాబు ప్రకటిస్తున్నారు.

మున్సిపల్ పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యలను, మున్సిపల్ పాఠశాలల ఉపాధ్యాయులకు పిఎఫ్ సౌకర్యం కల్పించే విధంగా ప్రభుత్వాన్ని ఒప్పించడంలో పిడిఎఫ్ కీలకపాత్ర పోషించిందని ఆయా పాఠశాల ఉపాధ్యాయులే చెబుతున్నారు. మున్సిపాలిటీలో జూనియర్ కళాశాలలు ప్రారంభించి మున్సిపల్ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని పిడిఎఫ్ డిమాండ్ చేస్తోందన్నారు. మున్సిపల్ పాఠశాలల స్థలాలన్ని ప్రైవేట్ వారికి అప్పగించే సందర్భంలో, మున్సిపల్ పాఠశాలలను నిర్వీర్యం చేసేవిధంగా తెలుగు మీడియం రద్దుచేసిన సందర్భంలో పిడిఎఫ్ తీవ్రంగా ప్రతిఘటించిందని మున్సిపల్ టీచర్ అహ్మద్ హుస్సేన్ అంటున్నారు.

సిపిఎస్ రద్దుకోసం జరిగిన ప్రతి పోరాటాలలో పాల్గొన్నారని, శాసనమండలిలో సిపిఎస్ రద్దుకోసం పిడిఎఫ్ ఎమ్మెల్సీలు ప్రభుత్వాన్ని నిలదీసేవారని, సిపిఎస్ ఉపాధ్యాయులను ఆది నారాయణ అభిప్రాయపడ్డారు. ప్రతి రాజకీయ పార్టీ తమ ఎన్నికల మేనిఫెస్టోలో సిపిఎస్ రద్దు అంశాన్ని చేర్చక తప్పని పరిస్థితి ఏర్పరచడంలో పిడిఎఫ్ పాత్ర అద్వితీయమని, భవిష్యత్‌లో సిపిఎస్ రద్దు కోసం పిడిఎఫ్ ఎమ్మెల్సీల ప్రయత్నం కొనసాగుతుందని, లాంటి వారిని శాసనమండలికి పంపడంలో సిపిఎస్ ఉద్యోగులు ముందుంటారని అన్నారు.

కరోనా కష్ట సమయంలో ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయుల జీవన ప్రమాణాలను కాపాడాలని పిడిఎఫ్ కోరిందని. గత ప్రభుత్వం హామీ ఇచ్చిన హెల్త్‌కార్డులు, కార్పస్ ఫండ్ వంటి సౌకర్యాలను కల్పించాలని పిడిఎఫ్ డిమాండ్ చేయటం తమ స్థితిగతులను మారుస్తుందని ప్రైవేట్ పాఠశాలల, కళాశాలల అధ్యాపకులు విశ్వాసంతో ఉన్నట్లు ప్రిన్సిపల్ రవీంద్ర పేర్కొంటున్నారు.

శాసనమండలిలో అన్ని మేనేజ్‌మెంట్ల, అన్ని కేడర్ల సమస్యలను ప్రస్తావించడం, నిరంతరం శాసన మండలిలో విద్యారంగం గురించి చర్చించడంలో పిడిఎఫ్ తీవ్రంగా కృషి చేస్తోంది. ప్రత్యేకంగా 'ఉద్యోగులు-ప్రభుత్వ వైఖరి' అనే అంశాన్ని చర్చకు తీసుకువచ్చి శాసనమండలిలో ప్రభుత్వాన్ని నిలదీయడం జరిగింది. అందుకే అన్ని కేడర్ల, అన్ని మేనేజ్‌మెంట్ల ఉపాధ్యాయుల నుండి పిడిఎఫ్ అభ్యర్థుల ప్రచారానికి విశేష ఆదరణ లభిస్తోంది. తప్పనిసరిగా వారిని శాసనమండలికి పంపిస్తామని, తద్వారా తమ వాణిని శాసన మండలిలో వినిపించుకునే అవకాశాన్ని కల్పించుకొంటామని చెబుతున్నారు.

# International Women's Day - March 8, 2021
# #ChooseToChallenge
# #IWD2021
# అంతర్జాతీయ మహిళా దినోత్సవం

20వ శతాబ్దం ప్రారంభంలో వేతనాల పెంపు, పని గంటల తగ్గింపు, మెరుగైన పని పరిస్థితుల కోసం మహిళలు ప్రారంభించిన పోరాటాలు శతాబ్దం గడిచినా నేటికీ ఇంకా పదో ఒక రూపంలో జరుగుతూనే ఉన్నాయి. ఆర్థికంగా ఉన్నతస్థాయికి ఎదిగిన మహిళా వ్యాపారవేత్తల్ని, చదువుకొని ఉద్యోగాలు చేస్తున్న కొంతమంది మహిళలను చూసి మహిళలు అందరూ అన్ని రంగాల్లో ముందున్నారని, పూర్తి స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు అనుభవిస్తున్నారని అనుకోవడం సరికాదు. మార్చినెల రాగానే ఉత్సాహంగా, అట్టహాసంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాలు నిర్వహించడం ఈ మధ్య కాలంలో ఎక్కువైంది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం నేపథ్యం, దాని వెనుక ఉన్న ఎన్నోవేలమంది మహిళల వెతలు, త్యాగాలు, వారు రగిలించిన పోరాట స్ఫూర్తిని గురించిన అవగాహన అవసరం.


బి.శ్రీదేవి నెల్లూరు

20వ శతాబ్దం ప్రారంభంలో ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలలోని మహిళల స్థితిగతులను పరిశీలిస్తే సోషలిస్టు దేశాలు మహిళల హక్కుల్ని, సమానత్వాన్ని కార్మిక సంస్థ మహిళల వృత్తిపరమైన హక్కుల్ని గుర్తించింది. మహిళలు బయటకు వచ్చి పనిచేయడం వలన కుటుంబాలు దెబ్బతింటాయని ఛాందసవాదులు భావించగా మహిళలు 'కుటుంబ' అనే సంకుచిత చట్రం నుండి బయటకు రావాలని, ఉత్పత్తిలో భాగస్వాములు కావాలని, ఆస్థిపై, భూమిపై హక్కులు పొందాలని మార్క్స్ వాదించారు.

పారిశ్రామిక విప్లవం చేతి వృత్తులను, గ్రామీణ పరిశ్రమలను దెబ్బతీసి ఆయా వృత్తుల వారిని కార్మికులుగా మార్చగా, పెట్టుబడిదారి వ్యవస్థలో వారు శ్రమదోపిడికి గురయ్యారు. ముఖ్యంగా మహిళలు తక్కువ వేతనానికి రోజుకి 18 గంటలపైగా దుర్భర పరిస్థితులలో పనిచేయవలసి రావడం వారిలో క్రోధాన్ని, ఆవేశాన్ని రగలించి పోరాటాలకు నాంది పలికింది.

ప్రపంచవ్యాప్తంగా మెరుగైన పని పరిస్థితులు, పని గంటల తగ్గింపు, వేతనాలలో పెంపు, సమానత్వం కోసం ఉద్యమాలు ప్రారంభమయ్యాయి. "ఆకలితో చావడంకన్నా, పోరాడుతూ చావడం మేలు" అన్న నినాదంతో మహిళా పోరాటాలు వెల్లువెత్తాయి. 1908లో 15000మంది మహిళలు పని గంటల తగ్గింపు, వేతనాల పెంపు, ఓటుహక్కు కోసం న్యూయార్క్‌లో ప్రదర్శన నిర్వహించారు. ఈ నేపథ్యంలో 1910లో 'క్లారాజెట్కిన్' ఆధ్వర్యంలో కోపెన్‌హాగన్‌లో జరిగిన సోషలిస్టు దేశాల మహిళలు సంవత్సరంలో ఒక రోజును ఈ మహిళా పోరాటాలన్నిటి సూచికగా పాటించాలని భావించి 'మార్చి 8'ని నిర్ణయించారు. ఇదే ఈనాటికీ మనం అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా జరుపుకుంటున్నాం.

నాటి నుండి జరిగిన పోరాటాలు, ముందుకు వచ్చిన డిమాండ్ల ఫలితంగా పరిస్థితులలో కొంత మార్పువచ్చింది. ముఖ్యంగా సోషలిస్టు దేశాలు మహిళలకు అనేక సౌకర్యాలు కల్పించి వారిపై పనిభారాన్ని తగ్గించే చర్యలు చేపట్టాయి. తత్ఫలితంగా సోషలిస్టు సమాజంలో మహిళల పరిస్థితి మెరుగుపడింది. 1980-1990 దశకంలో రష్యాలో మొత్తం పనిచేసే వయసున్న వారిలో 51%మంది మహిళలు ఉత్పత్తి, సేవారంగాల్లో పనిచేస్తుండడం, డాక్టర్లలో 68% మహిళలు కావడం దీనికి నిదర్శనం. అయితే ఎన్ని కార్యక్రమాలు చేపట్టినప్పటికి పురుషుల భావజాలంలో స్త్రీలు కూడా తమతో సమానమేనన్న భావాన్ని పెంపొందించే ప్రయత్నం జరగలేదన్నది వాస్తవం. ఈ కారణంగా సోషలిజం వల్ల లాభపడింది స్త్రీలే, సోషలిజం పతనంతో నష్టపోయింది కూడా స్త్రీలే అని చెప్పవచ్చు.

పెట్టుబడిదారి వ్యవస్థతోపాటు శ్రమదోపిడి పెరగడం, స్త్రీ, పురుషుల వేతనాల్లో అసమానతల వల్ల స్త్రీలు మరింత శ్రమదోపిడికి గురవుతున్నారు.

ప్రపంచవ్యాప్తంగా మహిళల పరిస్థితుల్ని మెరుగు పరచడం కోసం ఐక్యరాజ్యసమితి 1975లో రాబోయే దశాబ్దకాలాన్ని మహిళా దశాబ్దంగా ప్రకటించి మహిళా సంక్షేమ చర్యలు చేపట్టాల్సిం దిగా ప్రపంచ దేశాలకు దిశా నిర్దేశం చేసింది. ఈ కాలంలోనే మన దేశంలో జాతీయ మహిళా కమీషన్ ఐక్యరాజ్య సమితి మహిళా సాధికారత, రక్షణకు సంబంధించిన వివిధ అంశాలను వివిధ సంవత్సరాలలో ప్రాధాన్యతాంశాలుగా ప్రకటించింది.

1999-మహిళలపై హింసలేని ప్రపంచం

2003-లింగ సమానత్వం;

2006-మహిళలు, నిర్ణయాధికారం

2010-సమాన హక్కులు, అవకాశాలు

2012-గ్రామీణ మహిళా సాధికారత మొ॥ ఆయా సంవత్సరాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాల సందర్భంగా ఈ అంశాల గురించి చర్చపచర్చలు జరిగేవి.

ఏమైనప్పటికీ రాజకీయాధికారంలో మహిళల హక్కులు ముడిపడి ఉంటాయన్నది గుర్తించబడి "చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ బిల్లు" వంటి కీలక అంశం ఒక ప్రధాన డిమాండుగా ముందుకొచ్చింది. దశాబ్దాలు గడిచిపోతున్నా ఆ బిల్లు మాత్రం పార్లమెంట్‌లో

ఆమోదానికి నోచుకోపోవడం వెనుక ఎవరి రాజకీయ ప్రయోజనాలు దాగి ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. వారికి కావలసిన బిల్లులను పార్లమెంటు సమావేశాలు లేని కాలంలోనూ, ఏకపక్షంగా చట్టాలు, ఆర్డినెన్సుల రూపంలో అమల్లోకి తెచ్చే మన పాలకులకు వేదికలపై ఉపన్యాసాలివ్వడమేకాని మహిళా సాధికారత విషయంలో చిత్త శుద్ధి లేదు. ఈ బిల్లును పెండింగ్‌లో ఉంచే విషయంలో ఏ పార్టీ వైఖరి ఏమిటి అనేది కూడా మనం అర్థం చేసుకోవాలి.

పైగా ఇటీవలి కాలంలో దేశభక్తులు, సంస్కృతీ పరిరక్షకులమని చెప్పుకునే కొంతమంది మహిళల హక్కుల్ని, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను కాలరాసి కాలంచెల్లిన మనువాదాన్ని తిరిగి ముందుకి తెచ్చి అదే ప్రయత్నం చేస్తున్నారు. ప్రగతిశీల భావాలు వెల్లివిరిసే విద్యా సంస్థల్ని, ప్రశ్నించే వ్యక్తుల్ని, వ్యవస్థల్ని ధ్వంసం చేయడానికి తెగబడుతున్నారు.

ఎంత అణిచివేసినా ఆయా సందర్భాన్నిబట్టి మహిళా చైతన్యం పరిఢవిల్లుతోంది. నూతన పౌరసత్వ చట్టాలకు వ్యతిరేకంగా షాహిన్ బాగ్‌లో మహిళలు జరిపిన పోరాటం మహిళా పోరాట చరిత్రలో ముఖ్య ఘట్టం అని చెప్పవచ్చు. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో మహిళలు వారికి పెద్దఎత్తున సంఘీభావం ప్రకటించడం, వివిధ సామాజిక వర్గాలకు చెందిన మహిళలు ఐక్యంగా పోరాడడం హర్షించ దగిన పరిణామం.

అలాగే నిర్భయ, దిశ, దిశరవి, బాంబే హైకోర్టు తీర్పు సందర్భా లలో మహిళలపై హింస, అణిచివేతలకు వ్యతిరేకంగా వివిధ వర్గాల మధ్య విశేషమైన ఐక్యత కన్పించింది.

జూన్ 2020లో కేంద్ర ప్రభుత్వం తెచ్చిన 3 వ్యవసాయ నల్ల చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీలో జరుగుతున్న పోరాటంలో వయసు, చలి వాతావరణాన్ని లెక్కచేయకుండా వృద్ధ మహిళలు, మహిళా రైతుల భాగస్వాములవడం నేటి తరానికి స్ఫూర్తినిస్తోంది.

జెండర్ బడ్జెటింగ్ డిమాండ్ 2001 నుండి ఉన్నప్పటికి 2 దశాబ్దాల తర్వాత 2021 బడ్జెట్‌లో మహిళలకు కేటాయింపులు కేవలం 4.7%. ఇది కూడా గత సంవత్సరంకన్నా 0.6% తక్కువ. బడ్జెట్ కేటాయింపులు లేకుండా మహిళా సాధికారత ఎలా సాధ్యమో ఆలోచించాలి.

మహిళలు ఐక్యంగా పోరాటాలు జరపాల్సిన నేటి తరుణంలో ఉద్యమాల్ని నీరుగార్చి మహిళల్ని తమకు అనుకూలంగా మార్చుకు నేందుకు పాలకవర్గాలు ప్రయత్నిస్తుంటే మరొకవైపు మహిళలు ఉద్యమాలబాట పట్టకుండా సంస్కృతి, సంప్రదాయాల పేరుతో ఛాందసవాదులు మహిళల్లో భావదాస్యాన్ని, అస్థిత్వవాదాన్ని ప్రేరేపి స్తున్నారు. సామ్రాజ్యవాదం, ప్రపంచీకరణ, మార్కెట్ల మాయజాలం సైతం ప్రజల ఆలోచనలను ప్రభావితం చేస్తున్నాయి. మతతత్వం, ఛాందసవాదం పెరిగి మహిళలపై దాడులు, హింస పెరుగుతున్నాయి. మహిళల రక్షణకై పాటించాల్సిన ప్రమాణాల విషయంలో అంతర్జా తీయంగా మన దేశ స్థానం దిగజారింది.

అయితే ఈ పరిస్థితులు ఇంతేనని నిరాశపడనక్కరలేదు. మహిళల పురోగమన అంశాలను కూడా పరిగణలోకి తీసుకోవాలి. పరిమితా గానైనా అన్ని రంగాల్లో మహిళలు ప్రవేశించారు. కొన్ని రంగాల్లో కీలకస్థానాల్లో కూడా మహిళలు రాణిస్తున్నారు. ఇంటిపనితో సతమత మవుతున్నా వివిధ రంగాల్లో గణనీయ సంఖ్యలో పనిచేస్తున్నారు.

కోవిడ్-19 లాక్‌డౌన్ కాలంలో సెలబ్రిటీలు ఇంటిపనిచేసి సోషల్ మీడియాలో చేసుకున్న ప్రచారం కొద్దిరోజులకే పరిమితమైంది. మహిళలపై విపరీతమైన పనిభారం పెరగడమేకాక ఈ కాలంలో మహిళలపై కుటుంబ హింస పెరిగిందని సర్వేలలో వెల్లడైంది. స్త్రీ పురుషులిరువురూ సమానమేనన్న భావన, పురుషుల భావజాలంలో మార్పు, పరస్పర సహకారం, తోడ్పాటు, పోరాటాల మహిళా సాధికారత సాధ్యం.

ఈ దిశగానే అడుగులు వేయాలని ఐక్యరాజ్యసమితి 2021ని అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా "Women in Leadership-achieving an equal future in a covid-19 world" గా ప్రకటించింది. కోవిడ్-19 కారణంగా ఏర్పడిన అనిశ్చితినుండి సాధారణ పరిస్థితులు నెలకొంటున్న సందర్భంగానైనా రాబోయే రోజుల్లో నాయకత్వం, అధికారం, అవకాశాలు, సాధికారత విషయాల్లో మహిళలకు సమాన అవకాశాలు ఉండాలని, ఆ దిశగా ప్రపంచదేశాలు అడుగులు వేయాలని ఆశిద్దాం. సమైక్య, సమరశీల పోరాటాల ద్వారా మంచి భవిష్యత్తు కోసం కలిసి ఉద్యమిద్దాం.

## ఉద్యమ అభ్యర్థులను గెలిపించుకుందాం

ఉన్నారు. ఉద్యమాలకు పోరాటాలకు అండగా నిలిచారు. నీతికి నిజాయితీకి ప్రతి రూపాలుగా ఉన్నారు. ఉద్యమాల నుండి వచ్చారు కాబట్టి అలా ఉండగలిగారు.

కేంద్రం నూతన విద్యా విధానం పేర విద్య కార్పొరేటీకరణ, కాషాయికరణ చేస్తున్నది. టీచర్ల విద్యార్హతలతోపాటు రిక్రూట్‌మెంట్, ప్రమోషన్స్, బదిలీల విధానాల్లో పెనుమార్పులు రానున్నాయి. సీనియార్టీ, రిజర్వేషన్స్‌కి ముప్పు ఏర్పడనుంది.

ఈ విధానాలు అమలుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం అవుతోంది. ఉమ్మడి జాబితాలో ఉన్న విద్యను కేంద్రం గుప్పెట్లోకి వెళ్ళేలా నిర్ణయాలు చేస్తోంది. ఎన్నికలముందు హామీ ఇచ్చిన మెరుగైన పిఆర్‌సి, సిపిఎస్ రద్దు గురించి మాట్లాడటం లేదు. ఏకపక్ష నిర్ణయాలను ప్రశ్నించే సంఘాలను అధికారులు భరించలేకున్నారు. రోజుకొక ఉత్తర్వులు, రోజుకొక యాప్‌లతో, బోధనకు సంబంధం లేని పనులతో మానసిక క్షోభకు గురిచేస్తున్నారు. ఉపా ధ్యాయుల మధ్య అనైక్యతకు ప్రయత్నిస్తున్నారు.

ఈ పరిస్థితుల్లో మన మధ్య ఐక్యత పెరగాలి. ఉద్యమ చైతన్యంతో పోరాడి మన సమస్యలు సాధించుకోవాలి. ఇప్పటివరకు మనం అనుభవించే ప్రతి సౌకర్యం ఉద్యమాలు సాధించి పెట్టినవేతప్ప ఎవరూ దయతలచి ఇవ్వలేదు. మన సమస్యల సాధనకు, విద్యారంగ పరిరక్షణకు ఉద్యమ నేతలనే ఎమ్మెల్సీలుగా ఎన్నుకోవాలని, అందరికీ ఆదర్శంగా ఉండేలా విలువలకు పట్టం కట్టాలని విజ్ఞప్తి చేస్తున్నాము.

**మిత్రులారా!**

మార్చి 14వ తేదీన జరిగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉద్యమ నేతలైన పిడిఎఫ్ అభ్యర్థులు **బొడ్డు నాగేశ్వరరావు (కృష్ణా-గుంటూరు)**, **షేక్ సాబ్జీ (ఉభయగోదావరి జిల్లాలు)** గార్లకు **మొదటి ప్రాధాన్యత ఓటు ఇచ్చి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరుతున్నాము.**



# అధ్యాపక, ఉపాధ్యాయ ఉద్యమాల ఉమ్మడి అభ్యర్థి సాబ్జీని గెలిపిద్దాం

ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (పిడిఎఫ్) ఎమ్మెల్సీ అభ్యర్థి షేక్ సాబ్జీని గెలిపించుకునేందుకు అందరూ ఐక్యంగా కృషి చేయాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు.

అధ్యాపక,ఉపాధ్యాయ,ఉద్యమాల ఉమ్మడి అభ్యర్థిని గెలిపించుకోవడం మనందరి ముందున్న కర్తవ్యమని పేర్కొన్నారు. అధ్యాపక, ఉద్యోగుల వాణిని శాసనమండలిలో సమర్థవంతంగా వినిపించే నాయకులను ఎన్నుకోవాలని కోరారు. ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి జరుగుతున్న ఎన్నికల్లో భాగంగా ఏపీయుటిఎఫ్, ఏపిటిఎఫ్ (1938), డిటిఎఫ్, పిఈటి అండ్ ఎస్ఏ(పీఈ) అసోషియేషన్, ఎంటిఏ, ఏటిఏ, ఏపీఎంఎస్టిఎఫ్, జిజెఎల్ఏ, జిజెసిపిఏ, జిజెసిఎల్ఏ, ఏసిటిఏ, జిసిటిఏ, జిసిజిటిఏ, ఏపీఎస్ డబ్ల్యూఆర్ఈఎఫ్,ఏపీఎస్ డబ్ల్యూఆర్ఈఎ, ఏపీఆర్ఈఐటీఏ,జిఐటిఐ, ఏపిపిఏ సిఎల్ఏ తదితర ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాలు బలపరిచిన పిడీఎఫ్ అభ్యర్థి షేక్ సాబ్జీ ఫిబ్రవరి 22న నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా పశ్చిమ గోదావరి జిల్లా నుంచి తూర్పుగోదావరి జిల్లా కాకినాడ వరకు భారీ ర్యాలీ జరిగింది. ఉదయం 7 గంటలకు ఏలూరులో ప్రారంభమై రావుల పాలెం, మండపేట, రామచంద్రపురం, కరప మీదుగా ర్యాలీ మధ్యాహ్నానికి కాకినాడకు చేరుకుంది. స్థానిక బాలాజీ చెరువు సెంటర్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు పెద్ద ఎత్తున ప్రదర్శన జరిగింది. ప్రజానాట్యమండలి కళాకారుల డప్పుల దరువుల నడుమ అధ్యాపక, ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. పి.డి.ఎఫ్. అభ్యర్థి సాబ్జీ ని గెలిపించుకుందాం అంటూ ఓట్ ఫర్ సాబ్జీ నినాదాలు మారుమ్రోగించారు. అధ్యాపక, ఉపాధ్యాయుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని, సిపిఎస్ రద్దు చేయాలని, మెరుగైన పిఆర్సీని అమలు చేయాలని, పిడిఎఫ్ జిందాబాద్ అంటూ పెద్ద ఎత్తున దారిపొడవునా నినాదాలు మార్మోగాయి. మొత్తంగా నామినేషన్ వేసే కార్యక్రమం ఆద్యంతం సందడి వాతావరణంలో సాగింది. ప్రదర్శన అగ్రభాగాన అభ్యర్థితో పాటు తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రాము సూర్యారావు, శాసన మండలిలో పిడిఎఫ్ ఫ్లోర్ లీడర్ వి.బాల సుబ్రమణ్యం తో పాటు కె.ఎస్.లక్ష్మణరావు, యండపల్లి శ్రీనివాస రావు, ఇళ్ళ వెంకటేశ్వరరావు (ఐ.వి) తదితర ఎమ్మెల్సీ లు ఉన్నారు. అనంతరం కలెక్టరేట్ లోజిల్లా కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి డి.మురళీధర్ రెడ్డికి షేక్ సాబ్జీ నామినేషన్ పత్రాలను అందజేశారు. ఎమ్మెల్సీలు రాము సూర్యారావు, ఇళ్ల వెంకటేశ్వరరావు,యుటిఎఫ్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ పి.బాబురెడ్డి,రాష్ట్ర నాయకులు కె.ఎస్.ఎస్. ప్రసాద్, కె.సత్తిరాజు, తదితరులు ఆయన వెంట ఉన్నారు.

## సమస్యలు పరిష్కారానికి సాబ్జీని గెలిపించుకుందాం

ఉపాధ్యాయ, అధ్యాపక వర్గాల సమస్యలన్నింటినీ పరిష్కరించుకోవాలంటే, శాసనమండలిలో బలమైన వాదనను వినిపించాలంటే పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించుకోవాలని పలువురు వక్తలు పిలుపు నిచ్చారు. నామినేషన్ కార్యక్రమం అనంతరం స్థానిక సిబిసిఎంసి ఆవరణలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. జ్యోతిబసు అధ్యక్షతన బహిరంగ సభ జరిగింది. పిడిఎఫ్ ఫ్లోర్ లీడర్ వి.బాల సుబ్రమణ్యం మాట్లాడుతూ పోటీలో నిలిచిన షేక్ సాబ్జీకి ఎక్కువ సంఖ్యలో అనేక సంఘాల నుంచి సంపూర్ణ మద్దతు లభిస్తుందన్నారు. సాబ్జీ యుటిఎఫ్ నాయకుడిగానే కాకుండా అనేక ఉద్యమాల్లో నిరంతరం పోరాడుతున్న వ్యక్తిగా మంచి పేరు ఉందన్నారు. ఎవరు పిలిచినా పలికే వ్యక్తిగా సాబ్జీ ఉంటున్నారన్నారు. పలు సందర్భాల్లో క్లిష్ట సమస్యలు ఏర్పడినప్పుడు ఎదురొడ్డి వాటి పరిష్కారానికి పోరాడారన్నారు. ఈ నేపథ్యంలోనే అనేక సంఘాల నుంచి

ఏకపక్షంగా మద్దతు లభిస్తుందన్నారు. కార్పొరేట్ శక్తులు, కొన్ని రాజకీయ పార్టీలు పదవులను డబ్బులతో కొనేందుకు సిద్ధపడుతున్న నేటి కాలంలో ప్రజాస్వామ్యంగా ఎటువంటి ప్రలోభాలకు గురి చేయకుండా ఎమ్మెల్సీ ఎన్నికలలో పిడిఎఫ్ అభ్యర్థులు విజయం సాధిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో సాబ్జీ ని గెలిపించుకునేందుకు అందరూ సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఇటీవల కౌన్సిలింగ్ విధానంలో చేసిన గందరగోళం అందరికీ తెలిసిందేనన్నారు. శాసనమండలిలో ఉపాధ్యాయ, ఉద్యోగ అధ్యాపక, సామాన్యుల వాణి వినిపించేందుకు పిడిఎఫ్ ఎమ్మెల్సీల మంతా గట్టి కృషి చేస్తున్నామన్నారు. ఈ ఎన్నికల్లో ప్రలోభాలకు గురి చేసే వారిని నిలదీయాలన్నారు. ఇలా పలు అంశాలపై మాట్లాడిన ఆయన కార్యకర్తలను చైతన్య పరిచారు. మరో ఎమ్మెల్సీ కెఎస్. లక్ష్మణరావు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా పిడిఎఫ్ అభ్యర్థులు ఎటువంటి ప్రలోభాలకు గురి చేయకుండా ఎమ్మెల్సీ ఎన్నికలలో గెలుపొందుతున్నారన్నారు. గెలిచిన తర్వాత కూడా ఎక్కడ అవినీతికి పాల్పడకుండా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, ప్రైవేటు టీచర్ల సమస్యలపై నిరంతరం పని చేస్తూనే ఉన్నామన్నారు. అప్రెంటిస్ విధానం రద్దు కోసం కృషి చేసామన్నారు. విద్యారంగంలో ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పిడిఎఫ్ పోరాడుతుందని వివరించారు.

ఉభయ గోదావరి జిల్లాల టీచర్స్ ఎమ్మెల్సీ రాము సూర్యారావు మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు చేస్తున్న తనను శాసన మండలికి పంపి ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై ప్రశ్నించే అవకాశం కల్పించిన యుటిఎఫ్, వివిధ ఉపాధ్యాయ సంఘాలకు ధన్యవాదాలు తెలిపారు. పేద విద్యార్థుల ఉన్నత చదువు, వైద్యం కోసం నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. నిరుద్యోగ సమస్య పరిష్కారానికి నిరంతరం పని చేస్తానన్నారు. త్వరలో రిటైర్ కాబోతున్న తాను భవిష్యత్తులో జరగబోయే అన్ని ఉద్యమాలకు తోర్పాటును అందిస్తానని, సాబ్జీని అఖండ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

ఏపీటిఎఫ్ (1938) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అనేక ఉద్యమాల ద్వారా ఉపాధ్యాయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించుకోగలిగామన్నారు. ఈ నేపథ్యంలోనే ఉద్యమ అభ్యర్థిని గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో కార్పొరేట్ శక్తులు, పాలక పార్టీ పెద్దలు టీచర్లను ప్రలోభాలకు గురి చేసే అవకాశం ఉందన్నారు. వాటిని తిప్పికొట్టి బలమైన ఉద్యమం సాగిస్తున్న పిడిఎఫ్ అభ్యర్థిని గెలిపించు కోవాలని పిలుపునిచ్చారు. నూతన విద్యా విధానం పేరుతో విద్యారంగాన్ని ప్రైవేటు పరం చేయాలని చూస్తున్న పాలకుల తీరుకు వ్యతిరేకంగా పోరాడాలని కోరారు. ప్రభుత్వ ప్రజా, ఉపాధ్యాయ, ఉద్యోగ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఎదురొడ్డి పోరాడాలంటే సాబ్జీకి మొదటి ప్రాధాన్యతా ఓటును వేసి గెలిపించాలని కోరారు.

యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.బాబురెడ్డి మాట్లాడుతూ ఎటువంటి ప్రలోభాలకు గురి చేయకుండా దేశంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపొందిన ఒకే ఒక శక్తి పిడిఎఫ్ మాత్రమేనన్నారు. సమస్యల పరిష్కారం కోసం పెద్ద ఎత్తున ఉద్యమం సాగించాలంటే పిడిఎఫ్ మరింత బల పడాల్సిన అవసరం ఉందన్నారు. సిపిఎస్ రద్దు కోసం ఉద్యమాలు సాగించాలన్నారు. ప్రశ్నించే వాళ్ళు, సంఘాలు, ఉండకూడదని ప్రజా ఉద్యమాలను అణగదొక్కే పాలక పక్షాల కుట్రలకు వ్యతిరేకంగా మరిన్ని పోరాటాలు చేయవలసిన అవసరం ఉందన్నారు.

ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పిడిఎఫ్ ఎప్పుడు ప్రజా పక్షమేనన్నారు. బాధితుల పక్షాన ప్రశ్నించే గొంతుకగా శాసన మండలిలో తనవంతు పాత్రను వహిస్తున్నదని అన్నారు. 2007లో ఆవిర్భవించి నేటికి ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడుతున్నదని పేర్కొన్నారు. ఎయిడెడ్ వ్యవస్థకు పాడి కడుతున్న జగన్ జమానాకు వ్యతిరేకంగా పోరాడవలసిన సమయం ఆసన్నమైందన్నారు. మాట తప్పం మడమ తిప్పం అంటూ ముఖ్యమంత్రి వైయస్ జగన్ ప్రజలను మభ్యపెడుతూ మోసగిస్తు న్నారు. ప్రభుత్వ విద్యారంగాన్ని నాశనం చేసే కుట్రలు చేస్తున్నారని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన వెంటనే సిపియస్ రద్దు చేస్తామని మాట ఇచ్చిన జగన్ మాట తప్పారని గుర్తు చేశారు. డిఎలు, పీఆర్సిలు సకాలంలో ఇస్తామని చెప్పి మాట తప్పిన మహా ఘనుడు జగన్ అన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను ప్రభుత్వంలోకి లాగేస్తామని హామీ ఇచ్చి మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకా ఈ సభలో ఎయిడెడ్ కళాశాలల సంఘం రాష్ట్ర అధ్యక్షులు రఘురాం, ఏపీ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు ఎన్ పెద్దిరాజు, ఏపీ సోషల్ వెల్ఫేర్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు లక్ష్మణ్ కుమార్, ఏపీపిఈటీల సంఘం రాష్ట్ర అధ్యక్షులు లంక జార్జి, ఎటిఎ రాష్ట్ర నాయకులు కె.నాగేశ్వరరావు, ఏపీ రెసిడెన్షియల్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు శంకర్రావు, ఏసిటిఎ రాష్ట్ర నాయకులు డాక్టర్ కొండ రవి, ఏటిఏ రాష్ట్ర అధ్యక్షులు జలగం రాంబాబు, కళాశాలల ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ జేఏసీ చైర్మన్ జి.సుబ్రమణ్యం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరహరి తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో జి. ప్రభాకర వర్మ, టి. చక్రవర్తి, జి. నగేష్, టి. కామేశ్వరరావు, పెంకే వెంకటేశ్వరరావు, ఎం. విజయ గౌరి, ఎ. షరీఫ్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్ కుమార్ లతో పాటు వివిధ ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వాట్సాప్ ఫోటోలు పంపవద్దు

**"ఐక్యఉపాధ్యాయ"** కార్యక్రమాల ఫోటోలను వాట్సాప్‌లో పంపి స్తున్నారు. ఆ ఫోటోలు తక్కువ రిజల్యూషన్ ఉండటం వలన ప్రచురించడం ఇబ్బందిగా ఉంది. కావున కెమేరా ఫోటోలను మెయిల్ ద్వారా పంపగలరు. – సంపాదకవర్గం

# ఆదర్శనేత అమరజీవి ఏవిఎస్



యుటియఫ్ ఉద్యమ వారసులైన నేటితరం కార్యకర్తలకు అత్యంత ఆదర్శనీయుడైన నేత అమరజీవి అప్పారి వెంకటస్వామి గారు. ఒక చారిత్రక అవసరంగా 1974 ఆగష్టు 10న ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్‌ను స్థాపించడంలోను, దానిని అన్ని స్థాయిల, అన్ని ప్రాంతాల పాఠశాలలకు విస్తరింపజేయడంలోను, దానినొక సమరశీల పోరాట సంస్థగా తీర్చిదిద్దడంలోను ఆయన చూపిన దీక్షా దక్షతలు, చేసిన త్యాగం మరువలేనివి; ఆదర్శవంతమైనవి. యుటియఫ్ వ్యవస్థాపక ప్రధానకార్యదర్శిగా బాధ్యతలను చేపట్టిన ఆయన అవిశ్రాంతంగా రెండున్నర దశాబ్దాల పాటు దానికి నేతృత్వం వహించి, రాష్ట్రంలో అది అగ్రేసర సంఘంగా రూపుదిద్దుకోవడానికి ఏ ఆశయ బలంతో, ఏ నిబద్ధతతో కృషి చేశారో తెలుసు కోవడం ఉద్యమ కార్యకర్తలందరికీ ఎంతో స్ఫూర్తిదాయకం అవుతుంది.

**త్యాగశీలి :**

యుటియఫ్ రాష్ట్ర కార్యాలయం 1975 డిసెంబర్ 8న విజయవాడలో ప్రారంభించబడింది. అందుకనుగుణంగా ఏవిఎస్ గారు కుటుంబాన్ని అమలాపురం నుండి విజయవాడకు మార్చారు. తనను, తన భార్యను పెంచి పెద్ద చేసిన వారిరువురు చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయారు. తమ ఆత్మీయ బంధువులు వారిస్తున్నా, ఉద్యమ అవసరాన్ని గురించి వారికి నచ్చజెప్పి విజయవాడకు మకాం మార్చారు. ఉద్యమ పనిభారం పెరగడంతో ఉపాధ్యాయ వృత్తికి న్యాయం చేయలేనని భావించి, 15 సం॥ల సర్వీసును వదులుకొని 1978లో వాలంటరీ రిటైర్మెంట్ తీసుకొని పూర్తి కాలాన్ని ఉద్యమానికే అంకితం చేసిన త్యాగశీలి ఆయన. అంతేగాదు, ఉద్యమ విస్తరణకై నిరంతరం పనిచేస్తుండగా 1975లో గుండెపోటు వచ్చి గుండెకు శస్త్ర చికిత్స జరిగినా, 1998లో పాక్షికంగా పక్షవాతం వచ్చినా భయపడకుండా మరణించేవరకు అవిశ్రాంతంగా పనిచేశారు. ఉద్యమ సన్నిహితులకు మాత్రమే తెలిసిన ఈ విషయాలు సాధారణ కార్యకర్తలకు తెలియ వచ్చేవిగాదు, ఎందుకంటే ఆయన పని విధానం ఆయన సంపూర్ణ ఆరోగ్యవంతుడనే భావనను కలిగించేది.



కె.జోజయ్య
యుటియఫ్ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు

**నిర్మాణ దీక్షుడు – కార్యదీక్షపరుడు :**

పటిష్టమైన నిర్మాణమే పదునైన ఉద్యమానికి బాటవేస్తుందని నమ్మిన వెంకటస్వామిగారు మండల / పట్టణ, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో యుటియఫ్ నిర్మాణం చేయడంలో పలు జాగ్రత్తలు తీసుకొనేవారు. నిబంధనావళి కనుగుణంగా శాఖల నిక్కచ్చిగా జరగాలనే వారు. సంఘ నిర్మాణంలో ఉదారవాదాన్ని అంగీకరించేవాడు కాదు. రాష్ట్ర ఉపాధ్యాయ ఉద్యమంలో సోదర సంఘాల పోటీ ఎంతగా వున్నను యుటియఫ్ నిర్మాణంలో అనారోగ్యకర ధోరణులను నిర్ద్వందంగా ఖండించేవారు.

సమరశీల పోరాట సంస్థగా యుటియఫ్ నిలబడాలంటే కార్యకర్తలు నిరంతర శిక్షణ, నిత్య పోరాటాలు అవసరమని గుర్తెరిగిన ఆయన ఆ విషయాలపై ప్రత్యేక శ్రద్ధ చూపేవారు. నిబద్ధతగల కార్యకర్తలే ఉద్యమశక్తి గనుక అట్టి కార్యకర్తలను తయారు చేయసుకోవడానికి నిరంతర శిక్షణా తరగతులు అవసరమని భావించి, కార్యకర్తల శిక్షణా తరగతులను అన్ని స్థాయిలలో నూ ప్రణాళికబద్ధంగా నిర్వహించడంలో ప్రత్యేక దృష్టి పెట్టేవారు. విద్యారంగ సమస్యలు, ఉపాధ్యాయ వృత్తి సమస్యలు, ఉపాధ్యాయ ఉద్యమం, సమకాలీన సామాజిక ఆర్థిక స్థితిగతులు మున్నగు విషయాలు ఆ శిక్షణా తరగతులలో తప్పనిసరి బోధనాంశాలుగా వుండేటట్లు చూసే వారు.

ఉపాధ్యాయ సమస్యలపైన, విద్యారంగ సమస్యలపైన రాజీలేని పోరాటం చేయడంలో కార్యకర్తలను ఉత్తేజపరిచే సందేశాలను అందించేవారు; అవినీతికి వ్యతిరేకంగా నికరంగా పోరాటం సల్పడంలో పలు సూచనలిచ్చేవారు. పోరాటం ద్వారానే ఉద్యమ వ్యాప్తి సాధ్యమవుతుందని ఉద్బోధించేవారు. అందుకు సాధనంగా "యుటియఫ్ వార్తలు" అనే కరదీపికను క్రమం తప్పకుండా ప్రతినెల కార్యకర్తలకు అందించేవారు. మొబైల్ ఫోన్లు లేని కాలంలో తాజా సమాచారాన్ని అందించడంలో అది ఎంతో ఉపయుక్తంగా వుండేది.

**ఆశయాలు, నిబద్ధతల మేలు కలయిక ఏవిఎస్ :**

ఆశయాలకు అంకితమైన వెంకటస్వామిగారు వాటిని అమలు జరపడంలో పట్టువదలని విక్రమార్కుడనే అనవచ్చు. యుటియఫ్ ఆశయాలకు (నిబంధనావళిలోని పాలసీ స్టేట్‌మెంట్, ఆశయాలు అనే చాప్టర్లను చూడగలరు) అనుగుణంగా నిర్ణయాలు చేయడంలో నూ, నిబద్ధతతో వాటిని అమలు జరపడంలోనూ తాను శ్రమించడమే గాక, వివిధ స్థాయిలలోని నాయకులు, కార్యకర్తలు కూడా పనిచేసే టట్లు ఉద్బోధించేవారు. ఎవరైనా అలసత్వం కనబరిస్తే నిర్మోహ మాటంగా దానిని ఎత్తిచూపి, వారిలో నిబద్ధతను పెంచేదానికి తనదైన శైలిలో, చొరవతో సూచనలిచ్చేవారు. యుటియఫ్ సూత్రాలైన "అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహ"లను నిబద్ధతతో ఆచరించినవారే నిజమైన యుటియఫ్ కార్యకర్తలు కాగలరని నిక్కచ్చిగా చెప్పేరు.

**పత్రిక, ప్రచురణలను తీర్చిదిద్దడం :**

ఉద్యమ వాణిగా "ఐక్యఉపాధ్యాయ" పత్రికను తీర్చిదిద్దడంలో అమరజీవి మైనేని వెంకటరత్నం గారితోపాటు వెంకటస్వామి గారు కూడా విశేషమైన కృషి చేశారు. సమయోచితంగా సంపాదకీయాలు వ్రాయడం, ముఖ చిత్రంగా విమర్శనాత్మక కార్టూనులు వేయించడం, విభిన్న విషయాలను వివిధ శీర్షికల క్రింద ప్రచురించడంలో ప్రత్యేక దృష్టి పెట్టేవారు.

ఉద్యోగులందరికీ వర్తించెడి జనరల్ ఉత్తర్వులతోపాటు, ఉపాధ్యాయులకు సంబంధించిన ప్రత్యేక ఉత్తర్వులను ఉపాధ్యాయులకు అందుబాటులోనికి తీసుకొనిరావడం కొరకు "అధ్యాపకదర్శిని" పేరుతో జిఓల సంపుటాలను ప్రచురించడం, అందుకు నిధులు సమకూర్చడంలోను ఆయన ప్రత్యేక శ్రద్ధ చూపేవారు. 1981 నుండి ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా డైరీని ప్రచురించడం, 10వ తరగతి పేద విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని 1994 నుండి మోడల్ క్వశ్చన్ పేపర్లు" ప్రచురించడం వంటివి వారి ఆధ్వర్యంలోనే జరిగేవి. ఆ విధంగా యుటియఫ్ ప్రచురణల విభాగాన్ని ఒక ప్రచార సాధనంగా కూడా తీర్చిదిద్దారు.

**యుటియఫ్ కార్యాలయాల నిర్మాణం :**

ఉపాధ్యాయులకు నిత్యం అందుబాటులో వుండి సేవలందించడానికి, ఉద్యమ వ్యాప్తికి యుటియఫ్ కార్యాలయాల అవసరాన్ని కార్యకర్తలు, ఉపాధ్యాయులు గుర్తించే విధంగా అన్ని సందర్భాలను వినియోగించేవారు. భవన నిర్మాణాలకు నిధులను సేకరించడంలోను ప్రత్యేక క్యాంపెయిన్‌లు నిర్వహించడంలోను ప్రత్యేక దృష్టి పెట్టేవారు. తొలుత విజయవాడలో విశాలమైన రాష్ట్ర కార్యాలయాన్ని నిర్మించడం లోను, రాష్ట్ర కార్యాలయాన్ని హైదరాబాద్‌కు మార్చాలనుకున్నప్పుడు అక్కడ మరొక విశాలమైన భవనాన్ని నిర్మించడంలోను, అందుకు అవసరమైన నిధుల సేకరణకు వారు రూపొందించే కార్యాచరణ అనన్య సామాన్యంగా వుండేది. అట్లే అన్ని జిల్లా కేంద్రాలలోను, ప్రాంతీయంగా మరికొన్ని చోట్ల యుటియఫ్ కార్యాలయాల ఏర్పాటులో, నిర్మాణంలో వారిచ్చే గైడెన్స్ కార్యకర్తలను ఉత్తేజితులను చేసేది. ఆ విధంగా 80శాతంపైగా యుటియఫ్ కార్యాలయాలు వారి కాలంలోనే నిర్మాణమయ్యాయి.

**మంచివక్త, రచయిత :**

రాష్ట్ర, జిల్లా, ప్రాంతీయ స్థాయిలలో జరిగే యుటియఫ్ కార్యవర్గాల కౌన్సిల్ సమావేశాలలో, విద్యా సదస్సులలో వెంకటస్వామిగారిచ్చే ఉపన్యాసాలు కార్యకర్తలను, ఉపాధ్యాయులను అమితంగా ఆకట్టుకొనేవి; ఉత్తేజానిచ్చి కార్యోన్ముఖుల్ని చేసేవి. తెలుగు భాషపై వారికి మంచి పట్టువుండేది. కనుకనే ఉపాధ్యాయేతరలను కూడా ఆయన ప్రసంగం ఆకట్టుకొనేది.

ఉద్యోగ, ఉపాధ్యాయ వ్యతిరేకమైన ప్రభుత్వ వైఖరిని నిశితంగా విమర్శించడంలోను, యుటియఫ్‌పై అక్కసుతో చేసే కువిమర్శలను త్రిప్పికొట్టడంలోను, కార్యకర్తలకు సామాజిక దృక్పథాన్ని ఉద్బోధించడంలోను వారి ప్రసంగధోరణి ఆకర్షణీయంగా వుండేది. అంతేగాక ఆయన చేతిలోని కలం కూడా చాలా పదునుగా వుండేది. వ్రాయడం మొదలు పెడితే ఏ విషయంపైనైనా సాధికారికంగా, సవివరంగా వ్రాసే వారు. కరపత్రాలు, నివేదికలు, వ్యాసాలు వ్రాయడంలో వారి భాషా పటిమ స్పష్టంగా కనిపిస్తుండేది.

**కార్యకర్తల పట్ల ఆదరాభిమానాలు :**

కార్యకర్తలతో ఉపాధ్యాయులతో ఆయన ఎంతో అప్యాయంగా మాట్లాడే వారు. ఎంత చిన్న కార్యకర్తనైనా గౌరవించి, మృదువుగా మాట్లాడేవారు. కార్యకర్తల వ్యక్తిగత, కుటుంబ యిబ్బందులను తెలుసుకొని తగిన సలహాలు యిస్తుండేవారు. క్యాంపెయిన్లలో పాల్గొనడానికి వెళ్ళినప్పుడు కార్యకర్తల కుటుంబ సభ్యులను పరామర్శించేవారు. వీలయితే వారిళ్ళలోనే బస చేసేవారు. అవన్నీ కార్యకర్తలు కార్యక్రమాలలో ఉత్సాహంగా పాల్గొనడానికి దోహద పడేవి.

**సమయపాలన, ఆర్థిక క్రమశిక్షణ :**

ఆయన రాష్ట్ర ఉద్యమ నాయకుడైననూ నిర్ణీత వేళల్లో ఆఫీసుకు హాజరయ్యేవారు. ఉదయం 8 గంటలకే ఆఫీసు హాజరు పట్టీలో సంతకం చేసి, ఆ రోజు పనికి ఉపక్రమించేవారు. సంఘం నిధులను చాలా పొదుపుగా ఆచితూచి వాడేవారు; సంఘం అకౌంట్స్ నిర్వహించడంలోనూ చాలా నియమబద్ధంగా వుండేవారు. జమాఖర్చులను ఆడిట్ చేయించి నివేదికలను ఆయా సమావేశాలలో రెగ్యులర్‌గా ప్రవేశపెట్టేవారు. అదే విధంగా అన్ని శాఖలు ఆర్థిక క్రమశిక్షణ పాటించడంలో జాగ్రత్తలు తీసుకొనేవారు. ఆర్థిక క్రమశిక్షణ, నిజాయితీ కొరవడిన వ్యక్తి యుటియఫ్ కార్యకర్తగా అనర్హుడని నిక్కచ్చిగా, నిర్మోహమాటంగా ప్రకటించేవారు.

**ఆదర్శ జీవనం :**

ఏవిఎస్ గారి జీవన విధానం ఎందరికో ఆదర్శంగా వుండేది. రోజువారి కార్యక్రమాలు ప్రణాళికాబద్ధంగా వుండేవి. కార్యాలయాన్ని, పరిసరాలను పరిశుభ్రంగా వుంచడంలో తగిన జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు, మొక్కలను - చెట్లను సంరక్షించడం కూడా వారి నిత్యకృత్యంగా వుండేది. ఆయన ఎల్లప్పుడు తెల్లటి వస్త్రాలనే ధరించేవారు. అవి ఎంత స్వచ్ఛమో, ఆయన మనసుకూడా అంతే స్వచ్ఛంగా వుండేది.

ఏవిఎస్ గారి ఉద్యమ ప్రస్థానంలో వారి సతీమణి సత్యవతిగారి సహకారం, ప్రోత్సాహం ఎంతగానో వుండేవి. సమావేశాల సందర్భాలలో భోజన ఏర్పాట్లకు ఆమె ప్రత్యేక బాధ్యత తీసుకొనేవారు; స్వంత కుటుంబ శుభకార్యంలాగా అభిమానంతో ఆమె స్వయంగా కొసరి, కొసరి వడ్డించేవారు. దానితో రోజువారీ కార్యక్రమాల్లో తలమునకలై వుండే కార్యకర్తలు విజయవాడలో సేదతీరుతున్నట్లు ఫీలయ్యేవారు; మరింత ఉత్తేజితులయ్యేవారు.

వెంకటస్వామి, సత్యవతిగార్లు ఆదర్శ దంపతులు. ఉద్యమ నేపథ్యం వున్న కుటుంబాలకు చెందిన పిల్లలతో తమ పిల్లలిద్దరికి కులాంతర వివాహాలు చేసిన ఆదర్శవంతులు వారు.

విజయవాడ రాష్ట్ర కార్యాలయంలో దాదాపు 15 సం॥లపాటు, తర్వాత హైదరాబాద్‌లో ఏవిఎస్ గారితో కలిసి పనిచేసే అవకాశం నాకు లభించింది. ఆ అవకాశమే ఆయన వ్యక్తిత్వాన్ని, త్యాగనిరతిని, నిరంతర పరిశ్రమను, సామాజిక దృక్పథాన్ని నేను గుర్తించడానికి దోహదపడింది; ఉద్యమ కార్యకర్తగా ఎదగడానికి స్ఫూర్తినిచ్చింది.

యుటియఫ్ ఉద్యమ బలోపేతానికై తన జీవితాన్ని అర్పించిన ఆదర్శనేత అప్పారి వెంకటస్వామిగారి ఆశయాల బాటలో శక్తివంచన లేకుండా కృషి చేయడమే మనముందున్న కర్తవ్యం.

**ఆ అమరజీవి ఏవిఎస్ గారికి అరుణాంజలి!**




# పిడిఎఫ్ ఎమ్మెల్సీల గెలుపు - ప్రజాతంత్ర ఉద్యమాల గెలుపు

పిడిఎఫ్ ఎమ్మెల్సీలు బలపరచ్చిన కృష్ణా-గుంటూరు టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి, ఉద్యమ అభ్యర్థి బొడ్డు నాగేశ్వరరావు గెలుపు ప్రజా తంత్ర ఉద్యమాల గెలుపుగా భావించాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీల ఫ్లోర్ లీడర్ వి.బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. గుంటూరు-కృష్ణా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా బొడ్డ నాగేశ్వరరావు నామినేషన్ సందర్భంగా శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరం, గుంటూరులో యుటియఫ్ జిల్లా అధ్యక్షులు పి.ప్రేమ్‌కుమార్ అధ్యక్షతన బహిరంగ సభ జరిగింది. ఈ సందర్భంగా వి.బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వర్గాల గొంతుకగా పిడిఎఫ్ పనిచేస్తుందని, ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ ధ్యేయంగా కార్యాచరణలో వున్నామని తెలిపారు. డబ్బు, కులం, అధికారం ద్వారా రాజకీయకం కాకుండా అందరికీ అందుబాటులో వుంటూ, ప్రజల హక్కులను తెలిపారు. అధికారుల బెదిరింపులకు భయపడేది లేదని, డబ్బు ద్వారా ఉపాధ్యాయులను కొనలేరని నిరూపించాలని, డబ్బు ఎరవేసే వారిని బహిష్కరించాలని పిలుపునిచ్చారు.

పిడిఎఫ్ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ ఉద్యమాలలో పాల్గొనకుండా, ఎన్నికలప్పుడు ఉద్యమ అభ్యర్థులుగా మాట్లాడుతున్న వారి నైజాన్ని ఉపాధ్యాయ, అధ్యాపకులు గమనించాలని కోరారు. ఒక్క రోజు సిపిఎస్ రద్దు ఉద్యమంలో పాల్గొననివారు చెప్పే మాటలను గమనించి ఉపాధ్యాయులు మాటల్లో కాదు చేతుల్లో ఉద్యమాల అభ్యర్థి బొడ్డు నాగేశ్వరరావుని గెలిపించాలని కోరారు.

పిడిఎఫ్ ఎమ్మెల్సీలు రాము సూర్యారావు, ఐ.వెంకటేశ్వరరావు, వై.శ్రీనివాసులురెడ్డిలు మాట్లాడుతూ నిరంతరం ప్రజలతో వుండటం, ఉద్యమాలకు సహకరించడం ప్రత్యక్షంగా పాల్గొనడం, నిజాయితీగా నిబద్ధతితో వుండటం పిడిఎఫ్ లక్ష్యమని ఆ వైఖరికే చెందిన బొడ్డు నాగేశ్వరరావు గారిని గెలిపించుకోవడం ద్వారా ఉద్యమాలకు సహకరించాలని కోరారు.

ఈ సందర్భంగా జరిగిన సభలో ఏపిటిఎఫ్ (1938) రాష్ట్ర అధ్యక్షులు కె.వెంకటేశ్వరరావు, ప్రభుత్వ కళాశాలల రాష్ట్ర నాయకులు కైలాస్‌నాధ్, యుటియఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి.బాబురెడ్డి మాట్లాడారు. అలాగే ఉన్నత విద్య పరిరక్షణ కమిటీ రాష్ట్ర నాయకులు రాజగోపాల్, ఎం.టి.ఏ. జిల్లా అధ్యక్షులు షబ్బీర్ అహ్మద్, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ అసోసియేషన్ నాయకులు ప్రభాకర్, పాలిటెక్నిక్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు ఇనయతుల్లా, మోడల్ స్కూల్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు ఎన్.బోసుబాబు, హేమలత, ప్రైవేట్ స్కూల్ టీచర్స్, లెక్చరర్స్ రాష్ట్ర నాయకులు శైలజ, ఏపి రెసిడెన్షియల్ స్కూల్ అసోసియేషన్ నాయకులు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల కాంట్రాక్ట్ లెక్చరర్స్ రాష్ట్ర నాయకులు రమేష్, రత్న, డిగ్రీ కళాశాలల కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు, పాలిటెక్నిక్ కాంట్రాక్ట్ లెక్చరర్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు స్వాతి, సిఐటియు నాయకులు నేతాజి, వై.నరసింహ, డివైఎఫ్ఐ జిల్లా ప్రధానకార్యదర్శి బి.లక్ష్మణరావు పాల్గొని సంఘాభీవం తెలిపారు.

యుటియఫ్ రాష్ట్ర నాయకులు ఎన్.వెంకటేశ్వర్లు, ఏ.ఎన్.నాగ కుసుమ కుమారి, టిఎస్ఎల్ఎన్ మల్లేశ్వరరావు, ఎం.హనుమంత రావు, ఎం.కళాధర్, ఎన్.సుందరరావు, జి.విజయసారధి, బి.ఆదిలక్ష్మీ, యు.రాజశేఖర్, లెనిన్ బాబు, సుందరయ్య, కృష్ణా సుందరరావు, ఉమామహేశ్వరరావు, ఎన్.కుమార్‌రాజా తదితరులు పాల్గొన్నారు. సభ అనంతరం కోలాహలంగా ర్యాలీగా శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంనుండి కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి బొడ్డు నాగేశ్వరరావు మాట్లాడుతూ నిరంతరం ఉద్యమాలతో వుంటానని, నా గెలుపు, ఉద్యోగ, ఉపాధ్యాయుల గెలుపుగా భావిస్తానని, పిడిఎఫ్ ఎమ్మెల్సీల ఫోరంతో కలిసి పనిచేస్తానని, మార్చి 14న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని కోరారు.

ఈ కార్యక్రమానికి కృష్ణా-గుంటూరు జిల్లాల నుండి వేలాదిగా ఉపాధ్యాయులు నామినేషన్ కార్యక్రమానికి తరలివచ్చారు.

# కృష్ణా-గుంటూరు జిల్లాలలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి బొడ్డు నాగేశ్వరరావు



ఎమ్మెల్సీ కె.యస్.లక్ష్మణరావు



యుటియఫ్ ప్రచురణల కమిటీ కన్వీనర్ ఎం.హనుమంతరావు



యుటియఫ్ కృష్ణా జిల్లా అధ్యక్షులు జె.లెనిన్ బాబు



ఐక్యఉపాధ్యాయ ప్రధాన సంపాదకులు టి.ఎస్.ఎల్.ఎన్.మల్లేశ్వరరావు



యుటియఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి.బాబురెడ్డి



యుటియఫ్ కృష్ణా జిల్లా సహాధ్యక్షులు డి.అపర్ణ



మహిళా టీమ్



యుటియఫ్ గుంటూరు జిల్లా అధ్యక్షులు పి.ప్రేమ్ కుమార్



యుటియఫ్ కృష్ణా జిల్లా ప్రధానకార్యదర్శి ఎ.సుందరయ్య

# ఉభయ గోదావరి జిల్లాలలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి షేక్ సాబ్జీ




యుటియఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కె.ఎస్.ఎస్.ప్రసాద్



యుటియఫ్ రాష్ట్ర అకడమిక్ సెల్ కన్వీనర్ డి.రాము



పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి షేక్ సాబ్జీ



యుటియఫ్ పశ్చిమగోదావరి జిల్లా ప్రధానకార్యదర్శి బి.గోపీమూర్తి



యుటియఫ్ రాష్ట్ర ఆడిట్ కన్వీనర్ డి.వి.రాఘవులు



యుటియఫ్ సీనియర్ నాయకులు పి.వి.నరసింహారావు



పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి షేక్ సాబ్జీ





పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి షేక్ సాబ్జీ

## ఐక్యఉపాధ్యాయ కథలు - కవితలు పోటీలలో ప్రచురణకు ఎంపికైన కథ

# అనుగ్రహం

- ఎం.రమేష్ కుమార్, నెల్లిమర్ల, విజయనగరం జిల్లా

(ఫిబ్రవరి నెల సంచిక తరువాయి)

నాకక్కడ వుండబుద్ధికాలేదు. డాన్సులు చెయ్యాలంటే కాస్త సంప్రదాయమైన పాటలే లేవా..? ఇలాంటి పాటలకు డాన్సులు.. అదీ ఇక్కడ.. అమ్మవారి మంటపం ముందు చెయ్యాలా..?

వెళ్ళిపోబోతూ వెనక పందిరి మీద ఎత్తుగా నిలబడి వున్న అమ్మవారికేసి దృష్టి సారించాను. అమ్మ మొహంలో ఉగ్రత్వం ప్రస్ఫుటంగా కనిపిస్తోంది.

×××××

నవరాత్రులు నిర్వహించేవాళ్ళు రోజూ ఏదో ఒక సందడి, హంగామా చెయ్యడం మామూలే.. ఆరోజు రాత్రి దుర్గాదేవి భజన పెట్టించారు. ఈ భజన పాటలు పాడడానికి ప్రత్యేకంగా ఓ టీమ్ వుంటుంది. వాళ్ళనే పిలిపించారు.. భజన బృందం వచ్చి మొదలెట్టేసరికే రాత్రి పదయింది. అంటే తెల్లవారుఝాము వరకూ ఆ భజన కొనసాగుతుందన్నమాట.

పాటలు మొదలయ్యేయి. ఆ పాటలు కూడా సాధారణంగా వాళ్ళే రాసుకుంటారనుకుంటాను. లేదా ఒకోసారి అప్పటికప్పుడు కూర్చి పాడడం కూడా వుంటుంది. ఏది ఏమైనా అవన్నీ సినిమా పాటల బాణీల్ని అనుకరిస్తూ సాగుతాయి. పోనీ ఏదో భక్తి పాటల కార్యక్రమం కదా.. కాసేపు అక్కడ కూర్చుందామని వెళ్ళాను.

“ఇంత ఆలస్యంగా మొదలుపెట్టారేం..?” ఓ కమిటీ సభ్యుణ్ణి అడిగాను.

“మరి వాళ్ళు శుభ్రంగా మందు అదీ బిగించి రావాలి కదా.. అక్కడే ఆలస్యమయిపోయింది..” అన్నాడతను.

ఆ సంగతి స్పష్టంగా అర్థమవుతూనే వుంది.. ఎందుకంటే వాళ్ళ పక్కన భరించలేనంత కంపు కొడుతోంది.

గట్టిగా ఓ గంట పాటు పాడారో లేదో ఆపేసి కూర్చున్నారు. వాళ్ళలో వాళ్ళే ఏదో మాట్లాడుకుంటున్నారు.

సంగతేమిటని కనుక్కుంటే “వాళ్ళకి ఆయిల్ అయిపోయిందట. మళ్ళీ పడితే తప్ప బండి స్టార్టవదట.. కమిటీ వాళ్ళకు చెప్పారు... వాళ్ళు మందు కోసం వెళ్ళారు..” అన్నాడొకడు. సరే కానివ్వండని నేను ఇంటికొచ్చెయ్యబోతూ అప్రయత్నంగానే అమ్మవారి వంక చూశాను. ఎప్పటిలానే మాత చండ ప్రచండమైన ఆకారంతో రాక్షసుణ్ణి సంహరిస్తోంది.

రాత్రి రెండు గంటప్పుడు మెలకువ వచ్చి చూస్తే అంతా కామ్ గా వుంది. సాధారణంగా ఆ భజన తెల్లవారుఝాము వరకూ వుండాలి.. అప్పుడే ఆపేశారే.. అనుకున్నాను. ఉదయాన్నే ఆ విషయమే ఓ కమిటీ సభ్యుణ్ణి అడిగితే “రెండుసార్లు మందు బిగించేసరికి ఒక్కొక్కడికి ఒంటి మీద తెలివి లేదు సార్.. ఏం పాడుతున్నారో వాళ్ళకే అర్థం కావట్లేదు.. మళ్ళీ మందడిగారు.. ఇవ్వకపోతే మరింక పాడలేమన్నారు.. ఇచ్చినా మరి పాడలేరని మాకర్థమైంది. ఇంక చాలని చెప్పి మేమే పొమ్మన్నాం..” అన్నాడతను.

××××

